RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

సంపుటి : 04 | సంచిక : 145 | రంగారెడ్డి | ఎడిటర్ : గంజి వెంకటేశ్ | బుధవారం, ఏప్రిల్ 22, 2026 | పేజీలు : 8 | వెల: 3 రూ.


Volume: 04 | Issue :145 | Rangareddy | Editor: Ganji Venkatesh | Wednesday, April 22, 2026 | Pages:8 | Price: 3/-

## తెలంగాణకు 8 కొత్త రైళ్లు

హైదరాబాద్,ఏప్రిల్21(పద్మక్రాంతి):



రైల్వే మంత్రిత్వ శాఖ తెలంగాణకు ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా ఈ కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నుంచి ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు భువనేశ్వర్, తిరుచానూరు, తిరుపతి, శ్రీ గంగానగర్, జైపూర్ వంటి ముఖ్యమైన నగరాలకు కనెక్టివిటీని పెంచుతాయని, దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాగా, ఈ రైళ్లు మే నుంచి జూలై మధ్య దశల వారీగా ప్రారంభం అవుతాయి. రైళ్లన్నీ వారానికి ఒకసారి నడుస్తాయి. కాగా, తెలంగాణకు ఎనిమిది రైళ్లను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.



## ఔను..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

- కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి

"బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు."

హైదరాబాద్,ఏప్రిల్21(పద్మక్రాంతి):

కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరఫున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేసన్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు.జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ

03




**ప్రభుత్వంతో చర్చలు విఫలం**

హైదరాబాద్,ఏప్రిల్21(పద్మక్రాంతి):

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యం అయ్యింది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకు వెళుతున్నట్లు జెఎసి ప్రకటించింది.

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అంశం కీలక మలుపు తిరిగింది. టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో సమ్మె బాట పట్టాలని జేఏసీ నాయకులు నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వంతో జరిగిన తాజా చర్చల్లో సమస్యలకు తక్షణ పరిష్కారం కనిపించలేదని తెలిపారు. ఐఏఎస్ అధికారుల కమిటీ నాలుగు వారాల సమయం కోరగా, దానికి తాము అంగీకరించలేదని వెల్లడించారు. ఇప్పటికే చాలాకాలంగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, మరింత ఆలస్యం సహించలేమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. జేఏసీ నాయకుల ప్రకటన ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మె ప్రారంభించనున్నారు. ఈ సమ్మె తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రవాణా సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మార్చి 13వ తేదీన సమ్మె నోటీస్ ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. సమ్మెకు ముందురోజే చర్చలకు పిలవడం సరైన విధానం కాదని జేఏసీ నాయకులు విమర్శించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అధికారుల

03



### తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

- మోడీని టెర్రరిస్ట్ అంటూ ఎత్తిపొడుపు
- ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు
- అలా అనలేని మళ్లీ వివరణ ఇచ్చిన ఖర్గే

3 లో



### బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర

- 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్
- బైక్ ర్యాలీలపై ఇసి నిషేధం విధింపు

3 లో

### ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

- ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి
- కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ



3 లో

### 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

- తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు
- తాజా రాజకీయ పరిణాలపై చర్చించే ఛాన్స్

హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్

03



### తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

- నార్వే బృందంతో మంత్రి శ్రీధర బాబు

హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):

తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లక్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలిసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

## అబద్ధాలు చెప్పడం కేసీఆర్ నైజం



- పదేళ్లలో అబద్దాలతోనే పాలన చేశారు
- బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

నల్గొండ,ఏప్రిల్21(పద్మక్రాంతి):

అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని

03



### భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ

- కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

ఖమ్మం,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):

భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని

03

## ఖర్గేవి దిగజారుడు వ్యాఖ్యలు



- బాధ్యతాయుతమైన వ్యక్తి ఇలాంటి మాటలా
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):

ప్రధానమంత్రి నరేంద్రమోదీని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉగ్రవాది అని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపేర్కొన్నారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడిగా ఖర్గేకు పేరు ఉందని ప్రస్తావించారు. బాధ్యాతాయుతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై.. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఖర్గే.. మోదీపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం.. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో అహోరాత్రులు శ్రమిస్తున్న మోదీని ఉగ్రవాదిగా సంబోధించే ముందు.. ఉగ్రవాదులతో కాంగ్రెస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని మల్లికార్జున్ ఖర్గే గుర్తుపెట్టుకుంటే

03



## 23న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్ష

- ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):



ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో

03

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్ష్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకలు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప– అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని
ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు.

సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

- పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి
- మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం
- ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం






**చెన్నై,ఏప్రిల్21(పద్మక్రాంతి):**

తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని..
చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఎ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం



గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని
చంద్రబాబు ప్రశ్నించారు.

# ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

- రైతులను హెచ్చరించిన అధికారులు
- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

**రంగారెడ్డి,ఏప్రిల్21(పద్మక్రాంతి):**

ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా



చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన
చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి
- ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్

**అమరావతి,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే



ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా అగ్రగామి రాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బ్జడెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు. గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడంతో డిమాండ్ పడిపోతుందని, దాని ప్రభావం వ్యాపార రంగంపై కూడా పడుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు.. అవినీతి ఆరోపణలు, సంపద కూడబెట్టాలనే అధిక ఆశలతో ప్రభుత్వం దారి తప్పుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని మాజీ సీఎం జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# తమిళనాడు ఘటన తరహాలో కేరళలో ఘటన

- బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు
- ఆరుగురు మృతి..40 మందికి గాయాలు

**తిరువనంతపురం,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**



తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. త్రిస్సూర్ తిరువంబడిలోని ఓ బాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న జరగాల్సిన నమూనా బాణసంచా కోసం ఆ కేంద్రంలో సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలుగా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే.. నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆ యూనిట్లో పేలని బాణసంచా పదార్థాలు ఇంకా ఉన్నాయనే అనుమానంతో.. అత్యంత జాగ్రత్తగా సహాయక కార్యకలాపాలు సాగుతున్నాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# అబద్దాలు చెప్పడం కేసీఆర్ నైజం

మొదటి పేజీ తరువాయి ..

సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. వేఎమేప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే



ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళు,, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

మొదటి పేజీ తరువాయి ..

పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలో–నైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదదాస్పద వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి ..

**చెన్నై,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదంలో చిక్కుకున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చెన్నైలో మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో ఆయన క్షమాపణలు చెప్పాలంటూ భాజపా డిమాండ్ చేసింది అన్నాడీఎంకే–భాజపా పొత్తును ప్రశ్నించిన ఖర్గే.. ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రిని 'టెర్రరిస్టు'గా అభివర్ణించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే నని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరిరోజైన మంగళవారంనాడు ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ప్రచార సభలో చేసిన టెర్రరిస్టు వ్యాఖ్యలపై ఖర్గే వివరణ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, సీబీఐ, ఈడీ, ఆదాయం పన్ను శాఖ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఆ సందర్భంలోనే తాను మాట్లాడానని, మోదీని టెర్రరిస్టు అని తాను అనలేదని చెప్పారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు. కాంగ్రెస్, డీఎంకే కూటమి సాగించిన ప్రచారంపై మీడియా అడిగినప్పుడు, చాలాబాగా జరిగిందని, అన్ని చోట్ల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తమ కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఖర్గే సమాధానమిచ్చారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ ఒకే వేదిక నుంచి ప్రచారం సాగించకపోవడంపై అడిగినప్పుడు, ఆ విధంగా చూడకూడదని, ప్రతి ఒక్కరూ ప్లానింగ్ ప్రకారమే ప్రచారం చేస్తుంటారని చెప్పారు. 'నేను ఒకచోట నుంచి ప్రచారం చేస్తే, రాహుల్ మరో చోట ఉంటారు. ఎవరు ఎక్కడ ప్రచారం చేసినా సమష్టి ఆలోచనతోనే ప్రచారం సాగుతుంది. అంతా కలిసికట్టుగా పోరాటం సాగించాం. మేము గెలుస్తాం' అని ఖర్గే సమాధానమిచ్చారు. మోదీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈ అవమానకర వ్యాఖ్యలపై ఖర్గే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. తాను ఎప్పుడూ మోదీని ఉగ్రవాది అని అనలేదన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ప్రధాని మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మైండ్‌సెట్‌కు ఆయన చేసిన వ్యాఖ్యలు అద్దంపడతాయన్నారు. ఆయన నోరుజారి ఈ వ్యాఖ్యలు చేయలేదని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన ప్రసంగాల్లో ప్రధానిని నిందిస్తుంటారని, ఈరోజు రాహుల్ తరఫున మల్లికార్జున్ ఖర్గే ఆపని చేశారని అన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ ఒసామా బిన్ లాడెన్‌ను ఒసామాజీ అని, జకీర్ నాయక్‌ను శాంతిదూత అని సంబోధిస్తుంటుందని ఎద్దేవా చేశారు. ప్రధానిని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు నిందించినా ప్రజలు శిక్షిస్తూనే వచ్చారని, ఈసారి కూడా ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని అన్నారు.

# బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర

మొదటి పేజీ తరువాయి ..

**కోల్‌కతా,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**

అసెంబ్లీ ఎన్నికల పోరుకు పశ్చిమ బెంగాల్ సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలిదశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశ పోలింగ్ ప్రచారపర్వం ముగిసింది. ఏప్రిల్ 23న బెంగాల్‌లో 152 నియోజకవర్గాల్లో తొలి దశ పోలింగ్ జరగనుంది.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలకు ఉపక్రమించింది. బైక్ ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. రాత్రిపూట రాకపోకలను నియంత్రించడం, బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపైనా ఆంక్షలు విధించింది. మంగళవారం నుంచే ఆ ఆంక్షలను అమలు చేయాలని ఎన్నికల విధుల్లో ఉండే ఆయా విభాగాలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు బైకులు, స్కూటర్లను రోడ్లపైకి




అనుమతించరు. వైద్యసేవలు, కుటుంబ వేడుకలు, తదితర అత్యవసర కార్యక్రమాలకు హాజరయ్యే వారిని మాత్రమే అనుమతిస్తారు. బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించారు. పగటిపూట బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపై ఆంక్షలు విధించారు. పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను తీసుకెళ్లే వారికి మినహాయింపు ఇచ్చారు. పోలింగ్ రోజు కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల వేళ ఓటర్లపై బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్‌కు వెళ్లే వారికి ఆటంకం కలిగించడం, జామింగ్‌లను నివారించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. మినహాయింపు కోరుకునే వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇరుకుగా ఉండే వీధుల్లో నగదు, మద్యం తరలించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు బైక్‌లను ఉపయోగించే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

# 23న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్ష

మొదటి పేజీ తరువాయి ..

చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరిచారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని జాగృతి అధ్యక్షురాలు నిలదీశారు. వెయ్యి ఏళ్లైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస–్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

మొదటి పేజీ తరువాయి ..

# తెలంగాణ ఆర్టీసీ సమ్మె బాట..

కమిటీ సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పినా, స్పష్టమైన హామీ ఇవ్వలేదని తెలిపారు. జేఏసీ నాయకులు కార్మికులకు కీలక పిలుపునిచ్చారు. ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని, సమ్మెను ఐక్యంగా కొనసాగించాలని సూచించారు. అన్ని డిపోల్లో సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ఈ సమ్మె కారణంగా బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి. రోజువారీ ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. ప్రైవేట్ రవాణాపై ఆధారపడాల్సి రావచ్చు. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య త్వరగా పరిష్కారించాలని ప్రయాణికులు ఆశిస్తున్నారు. కార్మికుల సమ్మె తెలంగాణలో కీలక పరిణామంగా మారింది. చర్చలు విఫలం కావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, జేఏసీ వైఖరి ఈ సమ్మె భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**

భవిష్యత్‌లో 100 శాతం ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇంధన రంగం 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందుకోసం ఏకంగా ఏటా రూ.22 లక్షల కోట్లను ఖర్చుచేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇంధన ప్రత్యామ్నాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. కేవలం ఇథనాల్‌తోనే కాకుండా చెత్త నుంచి హైడ్రోజన్ తయారీ వంటి వినూత్న పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల వినియోగం తగ్గించాలని గడ్కరీ అన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల ధరల మీదనే కాకుండా ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనుకూలంగా ఉండేలా నాణ్యమైన ఇంజన్ల తయారీపై దృష్టి సారించాలన్నారు.

# ఖర్గేవి దిగజారుడు వ్యాఖ్యలు

బాగుండేదని ఎద్దేవా చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో.. కశ్మీర్ వేర్పాటువాద ఉగ్రవాది యాసిన్ మాలిక్‌తో చర్చలు జరిపిన విషయం ఖర్గేకు గుర్తులేదా..? అని ప్రశ్నించారు. ప్రధానిని ఉద్దేశించి మాట్లాడుతున్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. రాజకీయాల్లో మరీముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని.. కానీ ఈ ప్రయత్నంలో వ్యక్తిగత దూషణలకు చోటులేదని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ కావాల్సినంత విషం కక్కారని ఆగ్రహించారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు తమను ద్వేషిస్తున్నారని తెలిసి ఆవేదనతో, ఆక్రోషంతో ప్రధానమంత్రి మీద ఇలాంటి విమర్శలు చేయడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

## భూ వివాదాల పరిష్కారంలో
# తెలంగాణకు కొత్త దిశ

చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ఎ÷–లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో ఖచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# భువనగిరి బస్ స్టేషన్ 'ప్రైవేటు' పరేషాన్..!



- ఎండ వేడిలో బస్సుల్లో బందీలవుతున్న జనం
- బస్ స్టేషను కాదదీ.. ప్రయివేటు వాహనాల స్టాండు
- నిబంధనలు గాలికి.. ప్రయాణికులకు చుక్కలు
- నియంత్రణలో విఫలమైన ఆర్టీసీ అధికారులు

**సామల సిద్దులు - యాదాద్రి, ఏప్రిల్ 21 ( పద్మక్రాంతి) :**

అది ఒక ఆర్టీసీ బస్ స్టేషన్.. వందలాది మంది ప్రయాణికులు, పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నిరంతరం రాకపోకలు సాగించే ప్రాంతం. కానీ అక్కడ కనిపిస్తున్న దృశ్యాలు చూస్తుంటే అది బస్ స్టేషనా లేక ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలమా అన్న అనుమానం కలగక మానదు. భువనగిరి బస్ స్టేషన్ లో ప్రైవేటు వాహనాలు, ఆటోల ఆగడాలు మితిమీరిపోతున్నాయి.

ఆర్టీసీ అధికారుల అజమాయిషీ లేక పోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### అడ్డదిడ్డంగా వాహనాలు.. బస్సులకు బ్రేకులు



బస్ స్టేషను నుంచి బస్సులు బయటికి వెళ్లాల్సిన దారిలో, లోపలికి రావాల్సిన దారిలో యథేచ్చగా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిలిపివేస్తుండటంతో ఆర్టీసీ బస్సులు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. తాజాగా ఒక ప్రైవేటు కారు బస్సు దారికి అడ్డంగా నిలపడంతో, ప్రయాణికులతో ఉన్న బస్సు ఎండలో నిలిచిపోయింది. డ్రైవర్లు ఎంత హారన్ కొట్టినా, సిబ్బంది ఎంత మొత్తుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అరగంట అయినా అడ్డంగా ఉన్న కారుకు సంబంధించిన వారు రాకపోవడంతో ఆర్టీసీ బస్సు వెనక్కి వెళ్లి పక్క దారి గుండా వెళ్లింది. మిట్ట మధ్యాహ్నం కావడంతో ఎండ సెగకు ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. ప్రస్తుతం భానుడు భగభగమంటున్నాడు. మధ్యాహ్నం వేళ ఉష్ణోగ్రతలు 40℃ డిగ్రీలు దాటుతున్న తరుణంలో, ఎక్కువ సమయం బస్సులోనే ఉండిపోవాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్రంగా అల్లాడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఈ ఎండ వేడికి తాలలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

### ప్రయివేటును అధికారులు నియంత్రించగలరా..?

బస్టాండ్ లోకి ప్రైవేటు వాహనాలను ఎలా అనుమతిస్తారు? ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ ఏది? అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా ప్రయివేటు వాహనాలు బస్ స్టేషన్ లోపలికి వస్తున్నా, బస్సుల దారికి అడ్డం పడుతున్నా సంబంధిత అధికారులు గాఢ నిద్రలో ఉన్నారా అని ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేసి, ఇలాంటి అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భువనగిరి బస్ స్టేషన్ లో వాహనాల క్రమశిక్షణను పునరుద్ధరించాలని, ప్రైవేటు వాహనాలకు నియంత్రణ విధించాలని సామాన్య ప్రజలు ప్రయాణీకులు కోరుతున్నారు.

# ఇకపై ఆన్ లైన్ లోనే ఇసుక లభ్యత

- మన ఇసుక వాహనం ఆప్ ద్వారా బుకింగ్
- ఇందిరమ్మ ఇళ్ళకు ఇసుక ఉచితం
- కలెక్టర్ అనురాగ్ జయంతి



అనురాగ్ జయంతి
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

**సామల సిద్దులు - యాదాద్రి, ఏప్రిల్ 21 ( పద్మక్రాంతి) :**

జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా మన ఇసుక వాహనం ఆప్ ద్వారా ఆన్లైన్ లో బుకింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళు, స్వంత ఇంటి అవసరాలతో పాటుగా ప్రభుత్వ పనులకు కూడా ఆన్ లైన్ లో ఇసుకను పొందాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 7 ఇసుక రీచులను గుర్తించామని వాటిలో గుండాల, అడ్డగూడూరు, మోత్కూరు మోటకొండూరు మండలాలలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, ఇసుక బుకింగ్, సరఫరా ఆన్లైన్ విధానంలోనే జరిపి మాన్యువల్ విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. ఈ ఆన్లైన్ విధానం కొరకు మీ సేవా కేంద్రాలు, ఇంటర్నెట్ షాపుల నుంచి ఎంఎం.ఎంటిఐఎంబిఎంబి.టి.ఎస్ వెబ్సైట్ నుంచే కాకుండా స్మార్ట్ ఫోన్ నుంచి మన ఇసుక వాహనం యాప్ ద్వారా ఇసుక పొందవచ్చన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మ్యానువల్ విధానాన్ని రద్దు చేసి జిల్లాలో పూర్తిగా ఆన్లైన్ ద్వారా ఇసుక బుకింగ్ రవాణా జరిగేలా మన ఇసుక వాహనం విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇసుక రీచ్‌ల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటించి ప్రజలకు పారదర్శకంగా ఇసుక సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, స్వంత ఇంటి నిర్మాణం కొరకు మరియు ప్రభుత్వ నిర్మాణాలలో అవసరమైన ఇసుకను మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్ లో బుక్ చేసుకొని పొందగలరని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉచితంగా పొందవచ్చని తెలిపారు

# ఉపాధి హామీ కార్మికుల ధర్నా విజయవంతం.

## సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన సబ్ కలెక్టర్.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఏప్రిల్ 21,(పద్మక్రాంతి ప్రతినిధి):**



ఉపాధి హామీ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నా విజయవంతంగా జరిగింది.
అనంతరం సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్‌లో ఎక్కడా కనీస సౌకర్యాలు లేవని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులకు మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో లేవని, మూడు నెలలుగా వేతనాలు బకాయి పడి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా, పని ప్రదేశాల్లో అమలు చేస్తున్న రెండు ఫోటోల విధానం వల్ల అనేక మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ మెట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, వాచర్లకు సంవత్సరం పొడవునా పని కల్పించాలని, ప్రతి ఉపాధి కూలీకి సంవత్సరానికి కనీసం 200 పనిదినాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసత్ భారత్ జి రామ్ జి విధానం వల్ల కార్మికుల ఉపాధికి ముప్పు వాటిల్లుతోందని విమర్శించారు. సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కార్మికులతో మాట్లాడి వారి సమస్యలకు సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పని ప్రదేశాల్లో తక్షణమే మంచినీరు, టెంట్లు, మెడికల్ సదుపాయాలు కల్పించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రతి మండల అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని, తాను స్వయంగా పని ప్రదేశాలను సందర్శిస్తానని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. కాగజ్ నగర్ ఇన్చార్జ్ ఎంపీడీవో గౌరీ శంకర్ ని వెంటనే కనీస సదుపాయాలు కల్పించాలని మందలించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బొర్కుట్ రాజేందర్, సిఐటియు జిల్లా కార్యదర్శి జాదవ్ రాజేందర్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు పందుగ రాజేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, వాచర్లు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి.

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఏప్రిల్ 21,(పద్మక్రాంతి ప్రతినిధి):**




ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ జిల్లాలో 2 వారాలలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి లతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల తహసిల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సెర్ప్ ఎ పి ఎం లు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లతో మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభమవుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటరును 2002 సంవత్సరం ఓటరు జాబితాకు మ్యాపింగ్ చేయాలని, ఇంకా మ్యాపింగ్ కానీ ఓటరు వివరాలు సేకరించి వారు ఇక్కడి నుంచి వచ్చారు వివరాలతో పోల్చుకొని భారత ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను వేగంగా చేయడంలో పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసే మ్యాపింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ప్రతిరోజు మాపింగ్ ప్రక్రియపై పురోగతి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లు, సెర్ప్ ఎ పి ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన భార్య

**పాపన్నపేట,ఏప్రిల్21 (పద్మక్రాంతి)**




కుటుంబ కలహాలతో భార్య కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన ఘటన పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటు చేసుకుంది. పాపన్నపేట ఏఎస్సై తుక్కయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి....పొడ్చన్ పల్లి తండాకు చెందిన మాలోత్ కిషన్(60)వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. మద్యం మత్తులో తరచూ ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. సోమవారం రాత్రి సమయంలో కిషన్ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న భార్య మాలి, కొడుకు వినోద్ తో గొడవ చోటు చేసుకుంది. కిషన్ ను అంతమోదిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని భార్య మాలి,కొడుకు వినోద్ లు ఈ క్రమంలో భార్య మాలి, కొడుకు వినోద్ లు కిషన్ ను కింద పడేసి చేతులతో బాగా కొట్టారు. మాలి కిషన్ కాళ్లు గట్టిగా పట్టుకోగా వినోద్ కిషన్ గొంతు నొక్కి హత్య చేసి ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడేశారు. కొంత సేపటికి అటుగా వెళ్లిన స్థానికులు నీటి తొట్టిలో పడి ఉన్న కిషన్ ను గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. కిషన్ మృతి పట్ల అనుమానం రావడంతో మాలి, వినోద్ లను నిలదీయగా హత్య చేసిన విషయం తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించారు. మృతుడి కూతురు లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

# పుస్తే మెట్టెలు అందించి ఆశీర్వదించి కౌన్సిలర్ అప్పల సంధ్య



**పద్మక్రాంతి ఏప్రిల్ 21, (చేవేళ్ల ప్రతినిధి):**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు కౌన్సిలర్ అప్పల సంధ్య సురేష్ యాదవ్, మొయినాబాద్‌కు చెందిన పెద్దేళ్లని మాధవి కుమారుడి వివాహ సందర్భంగా పుస్తే మెట్టెలు అందించి ఆశీర్వదించారు. దంపతులకు సుఖసంతోషాలతో కూడిన దాంపత్య జీవితం కలగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆనందంలో పాలుపంచుకుంటూ, ప్రతి కుటుంబంతో అనుబంధాన్ని పెంచుకుంటున్న వారి సేవాభావం అభినందనీయమన్నారు.

## బోడుప్పల్లో శ్రీవాసవి జయంతి
# ఉత్సవాలకు ఏర్పాట్లు

**రాజకీయ ప్రముఖులను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు**

**బోడుప్పల్ ,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ కన్యకా పరమేశ్వరి, శివాలయ నిర్మాణ స్థలంలో ఏప్రిల్ 26 తేదీ ఆదివారం జరిగే వాసవి మాత జయంతి ఉత్సవాలకు, హోమం, పూజా, సంస్కృతిక శోభా యాత్రలకు ముఖ్య అతిథులుగా పాల్గొనవలసిందిగా స్థల దాత పొద్దుటూరి శోభా రాణి వెంకటేష్ గుప్త ఆధ్వర్యంలో వైశ్య సంఘము పెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ దయానంద్ తదితరులను ఆహ్వానించారు.



## మేడిపల్లిలో ఘనంగా
# యాదాద్రి హాస్పిటల్ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాజకీయ ప్రముఖులు





మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి డివిజన్లో అత్యాధునిక సదుపాయాలతో శ్రీ భవ్య తేజ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి హాస్పిటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, పిర్జాదిగూడ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, ఎంపల్ల అనంతరెడ్డి, సుభాష్ నాయక్, భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొని హాస్పిటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# చల్లూరు క్రషర్ పై తప్పుడు ఆరోపణలు చేయవద్దు

**అన్ని అనుమతులతోనే నిర్వహించాం**

**మా భూముల లోనికి ప్రజాప్రతినిధులను లాగవద్దు**

**ఎవరికి ఎలాంటి సంభందాలు లేవు**

**మీడియా సమావేశంలో యజమాని కర్నాటి శ్రీదేవి**



సామల సిద్దులు - యాదాద్రి, ఏప్రిల్ 21 ( పద్మక్రాంతి) :

తమపై వస్తున్న అక్రమ మైనింగ్, భూ ఆక్రమణల ఆరోపణలు పూర్తిగా అసత్యమని, మా భూములను రాజకీయాల్లోకి లాగవద్దని యజమాని కర్నాటి శ్రీదేవి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 322 లో జరుగుతున్న భూ వివాదం అక్రమ క్రషర్ ఆరోపణలపై ఆమె మంగళవారం చల్లూరులో విలేఖరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడించారు. ఈ భూమి 2016 నుండి తమ పేరిట ఉన్న పట్టా భూమి అని, ఇందులో ఎటువంటి ప్రభుత్వ భూమి అసైన్డ్ భూములు లేవని తెలిపారు. తమ భూముల విషయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేరును ప్రతిపక్షాలు కావాలనే లాగుతున్నాయని, ఆయనతో తమకు ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని అన్నారు. తాము ఆయనను ఎప్పుడూ కలవలేదని కూడా చెప్పారు. తన భర్త కీ.శే. కర్నాటి నారాయణరావు 2023లో అన్ని ప్రభుత్వ అనుమతులతో ఈ క్రషర్‌ను స్థాపించారని, వారి మరణంతో ఆర్థిక ఇబ్బందులు, నిర్వహణ అనుభవం లేకపోవడం వల్ల క్రషర్‌ను తమకు తెలిసిన హరికి లీజుకు ఇచ్చినట్లు వివరించారు. మొత్తం శ్రీని దెవలపర్స్ పేరిట 450 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి చేస్తున్నామని, ఆ డెవలప్‌మెంట్ పనుల కోసమే క్రషర్ మెటీరియల్‌ను వాడుతున్నామన్నారు. ప్రస్తుతం 70 ఎకరాల్లో మొదటి ఫేజ్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందవద్దని, ఈ ఏడాది చివరి నాటికి డెవలప్‌మెంట్ పూర్తి చేసి ప్లాట్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ మైలేజ్ కోసమే కొందరు ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారని, చట్టబద్ధంగా తాము అన్ని అనుమతులు కలిగి ఉన్నామని మీడియా వేదికగా తెలుపుతున్నామని చెప్పారు.

# బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్..

- మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి
- అన్న ప్రసాద వితరణ చేసి మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి
- గుడితాండలో 28వ సేవలాల్ మహారాజ్ వార్షికోత్సవం



కొత్తూర్ ఏప్రిల్ 21 ( పద్మ క్రాంతి ప్రతినిధి ):

బంజారాలలో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం కొత్తూరు మండలంలోని మల్లాపూర్ తండాలో పూజారి పాండు నాయక్,భక్తుల ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్, మరియమ్మ యాడి 28వ వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ చిట్టేడి నరసింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారన్నారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీనాక్షి దశరథ్ నాయక్,మాజీ సర్పంచ్ లు రాందాస్ నాయక్,కాట్న రాజు,ఉప సర్పంచ్ రాములు గౌడ్,శంకర్ నాయక్,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్,నాయకులు జయేందర్ రెడ్డి,రాజు గౌడ్,పాపిరెడ్డి,మోహన్ నాయక్, దయ్యాల పాండు,లక్ష్మణ్ నాయక్,గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సరైన ప్రణాళిక--శాస్త్రీయ దృక్పథం

**పాక్షిక సాంద్ర పద్ధతిలో పొట్టేళ్ల పెంపకం**

**ఆదర్శంగా నిలుస్తున్న రైతు తాగూర్ రాజేందర్ సింగ్**

సామల సిద్దులు - యాదాద్రి, ఏప్రిల్ 21 ( పద్మక్రాంతి) :

యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కొత్తజాల గ్రామంలో ఒక రైతు సాగిస్తున్న వినూత్న ప్రయోగం ఇప్పుడు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో హాట్ టాపిక్ గా మారింది. సాధారణంగా గొర్రెల పెంపకం అంటే అడవుల్లోనో, బీడు భూముల్లోనో తిప్పడం అని అనుకుంటాం. కానీ, రైతు ఠాగూర్ రాజేందర్ సింగ్ పాక్షిక సాంద్ర పద్ధతిలో పొట్టేళ్ల పెంపకాన్ని చేపట్టి లాభాల బాటలో పయనిస్తున్నారు. పొట్టేలు పిల్లలను తెచ్చి, వాటిని శాస్త్రీయ పద్ధతిలో పెంచి, పండుగలు మరియు శుభకార్యాల సమయానికి విక్రయిస్తూ మంచి ఆదాయం గడిస్తున్నారు.



పాక్షిక సాంద్ర పద్ధతిలో పెంచే పొట్టేళ్లకు అడవి జంతువుల భయం ఉండదు. షెడ్డులో పెరిగే పొట్టేళ్లు నాణ్యమైన మాంసాన్ని ఇస్తాయి, దీనివల్ల మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉంటుంది. జీవాల ద్వారా వచ్చే ఎరువును వ్యవసాయ పొలాలకు వాడుకోవచ్చు. పెట్టుబడి ఖర్చు కూడా తక్కువ ఉండి అంటు వ్యాధులు రావు.

డాక్టర్ ఎం. చంద్రారెడ్డి
పశు వైద్యాధికారి
రాజాపేట మండలం

> వ్యవసాయంలో వారసత్వంగా వచ్చే పద్ధతులకు ఆధునిక మెరుగులు అద్దితే విజయం మన వెంటే వస్తుంది. కొత్తజాల గ్రామంలో రాజేందర్ సింగ్ చేస్తున్న ఈ కృషి మరెంతో మంది యువతను పశుపోషణ వైపు మళ్లించేలా చేస్తోంది.
> వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడమే కాదు, అనుబంధ రంగాలైన పశు పోషణలో కూడా అద్భుతాలు చేయవచ్చని రాజేందర్ సింగ్ నిరూపిస్తున్నారు. రాజపేట మండలంలోని ఇతర రైతులు కూడా ఆయన ఫామ్‌ను సందర్శించి, ఈ పద్ధతుల గురించి అడిగి తెలుసుకుంటున్నారు.

అందరి రైతుల వలె పశు పోషణ కాకుండా కొత్తదనంగా పెంచాలనుకున్నాను. ప్రస్తుత రోజుల్లో మాంసాహారానికి మంచి డిమాండ్ ఉంది. భువనగిరి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కే. గోపిరెడ్డి స్థానిక మండల పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రారెడ్డి సూచనలను పాటించాను. పాటించాను. సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృక్పథం ఉంటే వ్యవసాయం ఎప్పటికీ నష్టదాయకం కాదు.

తాగూర్ రాజేందర్ సింగ్
రైతు



పొట్టేళ్ల మేతకు మేలు రకమైన గడ్డిని పరిశీలిస్తున్న పశు వైద్యులు..

**గడ్డి మైదానం కాదు.. గ్రిడ్ మేనేజ్మెంట్!**

సాంప్రదాయ పద్ధతిలో గొర్రెలను మేపడం వల్ల శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువ. కానీ రాజేందర్ సింగ్ ఎంచుకున్న ఈ పాక్షిక సాంద్ర పద్ధతిలో వినూత్న మార్పులు ఉన్నాయి. పొట్టేళ్లను రోజంతా బయట తిప్పకుండా, కేవలం కొన్ని గంటలు మాత్రమే బయటకు పంపిస్తారు. మిగతా సమయం షెడ్డులోనే పోషక విలువలున్న పచ్చిగడ్డి, దాణా అందిస్తారు.
జీవాలు ఎక్కువగా అడవంతా తిరగవు కాబట్టి, వాటి శక్తి వృథా కాకుండా త్వరగా బరువు పెరుగుతాయి. పాక్షిక సాంద్ర పద్ధతిలో జీవాల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండటం.. టీకాలు, నట్టల నివారణ మందులు సకాలంలో అందించడం వల్ల మరణాల రేటు గణనీయంగా తగ్గి దిగుబడి పెరుగుతుంది

# 2027 జనగణనను సమర్ధవంతంగా పూర్తి చేయాలి

**చేవెళ్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పార్థ సింహారెడ్డి**



పద్మక్రాంతి ఏప్రిల్ 21, (చేవేళ్ల ప్రతినిధి):

2027 జనగణనను సమర్ధవంతంగా పూర్తి చేయాలని చేవెళ్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పార్థ సింహారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్‌ఎల్‌ఓ 2027) జనగణనపై ఎన్యూమరేటర్లు మరియు సూపర్ వైజర్లకు నిర్వహించిన మూడు రోజుల మొదటి విడత శిక్షణ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పార్థ సింహారెడ్డి తహశీల్దార్ కృష్ణయ్య మరియు మండల విద్యాధికారి పురందాసు కలిసి హాజరైయ్యారు. 2027 జనగణనను పకడ్బందీగా నిర్వహించడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణార్థులకు పలు విలువైన సూచనలు అందించారు. రాబోయే ఫీల్డ్ ట్రైనర్లుగా పాపగారి ఆశీర్వాదం మరియు ఆర్. అక్షయ్ కుమార్ వ్యవహరించి గణన ప్రక్రియపై ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించగా, శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ ఎంతో ఆసక్తితో తమ శిక్షణను పూర్తి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చందిప్ప మరకత శివలింగం ఆలయ కమిటీకి దేవాదాయ శాఖ నోటీసుల జారీ

పద్మక్రాంతి ఏప్రిల్ 21, (చేవేళ్ల ప్రతినిధి):



రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం,చందిప్ప మరకత శివలింగం ఆలయ కమిటీకి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నోటీసు జారీ చేసింది. ఈ నెల 15వ తేదీతో గడువు ముగియటంతో ఐదేండ్ల ఆలయ ఖాతాలు, రాకార్డులన్నింటిని ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. లేనిచో చట్ట ప్రకారం ఎండోన్మెంట్ అధికారుల చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. చందిప్ప గ్రామంలోని మరకత శివలింగ ఆలయ కమిటి సభ్యులకు మార్చి 30న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సంబంధిత అధికారులు నోటీసు జారి చేయడటంతో ఇకపై ఈఆలయ నిర్వహణ దేవాదయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. మరకత శివలింగ నామ కరణ భక్తుడు, ఆలయ పునః నిర్మాణ శ్రీకారకుడు, కోటి దీపోత్సవం భక్తి టీవీ ధర్మకర్త అవార్డు గ్రహీత ఆర్.నరేష్ కుమార్ 10-6-2005 తేదీన ఇచ్చిన పిర్యాదు మేరకు ఎండోన్మెంట్ అధికారులు శాఖా పరంగా నోటీసులు జారీ చేశారు. గత ఐదు



సంవత్సరాల ఆలయ ఖాతాలు, రికార్డులన్నింటిని 15రోజుల్లోపు కార్యాలయానికి అందించవలసిందిగా ఆలయ కమిటీ సభ్యులను దేవాదయ శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారం. అలా చేయడంలో ఆలయ కమిటీ విఫలమైతే నిబంధనల ప్రకారం తదుపరి అవసరమైన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. చట్టం 30/1987లోని సెక్షన్ 29 ప్రకారం సదరు ఆలయానికి శాఖా పరమైన వ్యక్తిని నిమించడం కోసం అవసరమైన నివేదికను కమిషనర్ దేవాదాయ శాఖ, తెలంగాణ హైదరాబాద్ కార్యాలయానికి ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## డబల్ బెడ్ రూం ఇండ్లు పొందిన లబ్దిదారులు

# ఇండ్లలో తప్పకుండ నివసించాలి.

**పూర్తైన ఇండ్లు, నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను లబ్దిదారులకు కేటాయించాలి.**

**ఇండ్లలో నివసించకుంటే నోటీసులు ఇచ్చి రద్దు చేయాలి.**

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.**

రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 21 (పద్మక్రాంతి ప్రతినిధి):



డబల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించిన వాటిలో లబ్ధిదారులు నివసించకుంటే వెంటనే నోటీసులు ఇచ్చి రద్దు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో పూర్తైన, నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించుటకు ఎంపిక చేసిన లబ్దిదారులకు కేటాయించాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుంచి పేద వారిని ఎంపిక చేయాలని సూచించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు వాటిలో నివాసం ఉండని లబ్దిదారులు వెంటనే తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలన్నారు. ఏమైనా



ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని, లేని యెడల వారికి కేటాయించిన ఇండ్లను రద్దు చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి ఎంపీడీవో ఆధ్వర్యంలో

# వారాంత సమీక్ష సమావేశం



పద్మక్రాంతి ఏప్రిల్ 21, (చేవేళ్ల ప్రతినిధి):



శంకర్‌పల్లి మండల పరిధిలో ఈ రోజు ఎంపీడీవో వేంకయ్య ఆధ్వర్యంలో సెక్రటరీల వారాంత సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డీఎల్పీవో, ఎంపీఓ, సూపరింటెండెంట్‌లు మరియు సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా క్రింది అంశాలపై సమగ్రంగా చర్చించారు. జీపీపీడీపీ మరియు పీఎఫ్‌ఎంఎస్ గ్రాంట్ల పురోగతిపై సమీక్షించారు. ఎంపీఐసీ / జీపీఐసీ ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ చేశారు. వ్యక్తిగత లబ్ధిదారుల పథకాల అంశాలు, కొత్త దరఖాస్తులు,అదనపు చేర్పులు, బేస్‌లైన్ స్థాయి వివరాలపై చర్చించారు. శానిటేషన్ మరియు రికార్డు నిర్వహణ, 99 రోజుల ప్రణాళికల అమలు పురోగతిపై సమీక్షించారు. ఈజీఎస్ పనుల పురోగతి,సోక్‌పిట్స్, హౌసింగ్,నర్సరీ అభివృద్ధి,ఎంఎండబ్ల్యూఎస్ పనులు, గ్రామ పంచాయతీ ఆస్తుల నిర్వహణ అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంబంధిత అధికారులు తమ తమ పనులను సమయానికి పూర్తి చేయాలని, లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# మహిళా రిజర్వేషన్ బిల్లును బిజెపి రాజకీయం చేస్తుంది

**తన రాజకీయ లబ్ధి కోసం ఇతర పార్టీలను నిందిస్తుంది**

**మహిళా రిజర్వేషన్ బిల్లు 202 లోనే పాస్ అయింది**

**మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎవరు వ్యతిరేకం కాదు**

**- పీర్జాదిగూడ బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి**



**మేడిపల్లి, ఏప్రిల్ 21 (పద్మక్రాంతి):**

33% మహిళ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకపోవడం తో రాజకీయ పార్టీలు మహిళా బిల్లును పావుగా వాడుకుంటున్నాయి ఎవరికి తోచిన రీతిలో వారు వాదిస్తూ సమర్థించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పీర్జాదిగూడ బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి స్పందిస్తూ

మహిళా బిల్లు పై బీజేపీ నేతలు, కొంత మంది సోకాల్డ్ మేధావులు చెప్పేవి అబద్ధం. బీజేపీ ప్రజలను మోసం చేస్తుంది. మన దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 లోనే పాసయింది. 106 రాజ్యాంగ సవరణ ద్వారా ఈ బిల్లు తీసుకువచ్చారు. గౌరవ రాష్ట్రపతి కూడా ఈ బిల్లును ఆమోదించారు. ఏ బిల్లు అయిన పార్లమెంట్ లో 2/3 మెజారిటీతో పాసై గౌరవ రాష్ట్రపతి సంతకంతో ఆమోదం పొందిన తరువాత చట్టంలో చేర్చాలి. దాని కోసం ఒక గెజిట్ రిలీజ్ చేయాలి. అప్పుడు మహిళలకు 33% రిజర్వేషన్లు చట్టబద్ధంగా వర్తిస్తాయి. 2023 లో కోన్నీ రాష్ట్రాల ఎన్నికలు 2024 లో దేశంలో జనరల్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు 33% మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేకనే గెజిట్ రిలీజ్ చేయలేదు తద్వారా చట్టంలో చేర్చలేదు. అందుకనే బీజేపీ మహిళలను, ప్రజలను 2024 ఎన్నికలప్పుడు మోసం చేసింది. ఇప్పుడు డీ లిమిటేషన్ బిల్లు పెడితే ప్రతిపక్షాలు ఒప్పుకోవు, కొన్ని ప్రాంతాల ప్రజలు ఒప్పుకోరు, రాష్ట్రాలు తిరగబడుతాయి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఒక్కటై కొట్లాడుతాయి అని బీజేపీ ప్రభుత్వానికి తెలుసు. అందుకనే డీ లిమిటేషన్ బిల్లుకు మహిళా రిజర్వేషన్ అనే చొక్కాను తొడిగారని, 2023 సంవత్సరంలో పాసైన మహిళా రిజర్వేషన్ బిల్లును అమెన్మెంట్ పేరుతో ఏప్రిల్ 16 2026 మళ్ళీ తీసుకువచ్చారు. ఇక్కడ విశేషం ఏమిటంటే గెజిట్ చేయకపోతే చట్టంలో చేర్చడం కుదరదు. 2023లో పాసైన మహిళ రిజర్వేషన్ బిల్లుకు 2026 లో గెజిట్ పెట్టారు. తద్వారా మహిళా రిజర్వేషన్ పేరుతో డీ లిమిటేషన్ బిల్లును కొట్టేయలనుకున్నారు. ఇది అసలు జరిగిన కుట్ర, దీనిని గమనించిన విపక్ష పార్టీల సబ్యులు ఇట్టి బిల్లులను ఆమోదించలేదు. మహిళా రిజర్వేషన్, డీ లిమిటేషన్ బిల్లులను వేరు వేరుగా పెట్టమని అడిగారు. మహిళా రిజర్వేషన్ బిల్లు/గెజిట్ కి వ్యతిరేకం కాదని తెలిపారు. డీ లిమిటేషన్ బిల్లు కచ్చితంగా బీజేపీ పార్టీకి లాభం చేకూరుస్తుంది. దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి రావడం కష్టం. పార్లమెంట్ స్థానాలు వారు ఆశించిన స్థాయిలో రాలేదు, రావు కూడా డీ లిమిటేషన్ విషయానికి వస్తే ఇక్కడ మూడు విషయాలు ఉన్నాయి. 1.కాంస్టిట్యూషన్ 131 వ రాజ్యాంగ సవరణ 2. యూనియన్ టెర్రిటోరిస్ లా 3. డీ లిమిటేషన్ లు అనే మూడు బిల్లులు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉన్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం 543 పార్లమెంట్ స్థానాలను 850కి పెంచాలి అనుకున్నారు, ప్రతీ రాష్ట్రంలో 50% స్థానాలను పెంచాలనుకున్నారు. ఉదాహరణకు మన తెలంగాణ రాష్ట్రంలో 16 స్థానాలు 50% పెరిగి 24 స్థానాలు అవుతాయి. అదే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 80 లోక్ సభ స్థానాలు 50% పెరిగితే 120 కి చేరుతుంది. ఇలా ఉత్తరాదిలో పార్లమెంట్ స్థానాలు ఎక్కడికో వెళ్లిపోతాయి. అప్పుడు భారత దేశ భవిష్యత్తును ఒకటి రెండు రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. అప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. దక్షిణాదిన బీజేపీ కి ఓట్లు లేకున్నా రాకున్నా పని లేదు, ఉత్తరాది రాష్ట్రాలతో ప్రధానమంత్రి బీజేపీ పార్టీ నే కొనసాగుతుంది. అదే ఇప్పుడు పెట్టిన కుట్రపూరిత డీ లిమిటేషన్ బిల్లు. ఇక్కడ పార్లమెంట్ సీట్లు పెంచాలంటే ఆర్టికల్ 81 ని అమెన్మెంట్ చేయాలి, నియోజకవర్గాలను పెంచాలంటే ఆర్టికల్ 334 ను సవరణ చేయాలి. అదే బిల్లులు ఇప్పుడు పెట్టారు. ఈ బిల్లు పాసైతే బీజేపీ పార్టీ అధికారంలోకి రావడానికి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, బీహార్ ఐదు రాష్ట్రాలు చాలు. మిగతా రాష్ట్రాలలో ఓట్లు పడకున్నా వచ్చే నష్టం బీజేపీ కి లేదు. అప్పుడు వేరే రాష్ట్రాలలో అభివృద్ధి మీద కూడా దృష్టి ఉండదు. ఈ బిల్లు జనాభా ప్రాతిపదికన చేసిన దక్షినాది రాష్ట్రాలకు అన్యాయమే జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించి జనాభాను తగ్గిస్తే, ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం జనాభా నియంత్రణను తుంగలోకి తొక్కి జనాభాను గణనీయంగా పెంచుకున్నాయి.

# రియల్ ఎస్టేట్ లో దూసుకెళుతున్న
# ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా ప్రాజెక్ట్.

- **హైటెక్ సిటీ గచ్చిబౌలి లి మెరిడియన్ 5 స్టార్ హోటల్ లో ఘనంగా 4వ ఆర్థిక సమావేశం.**
- **మార్కెట్ లో దూసుకెళ్లిన అసోసియేట్ విజేతలకు మెమెంటో అందించిన యాజమాన్యం.**

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (పద్మక్రాంతి ప్రతినిధి):**

జాతీయ రహదారులకు అనుకుని ఉన్న ఓపెన్ ప్లాట్లు వినియోగదారులకు తక్కువ ధరకు అందిస్తున్న ఘనత ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా ప్రాజెక్ట్ కే సాధ్యమని యాజమాన్యం సూచించింది. మంగళవారం నగరం లోని హైటెక్ సిటీ గచ్చిబౌలిలో లి మెరిడియన్ 5 స్టార్ హోటల్ లో ఘనంగా 4వ ఆర్థిక సమావేశం అసోసియేట్ సభ్యులు, మార్కెటింగ్ లీడర్లతో నిర్వహించింది. ఈ 2025 -26 ఆర్థిక సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్.బీ.ఎం యాజమాన్యం సీఈఓ బి.సాంబశివుడు, సిఎఫ్ఓ ఎం. బాలకృష్ణ, సీఎంఓ కె.మల్లయ్య, సిఓఓ ఎన్. మల్లేష్ యాదవ్ లు హాజరై మార్కెటింగ్ లీడర్లకు దిశానిర్దేశం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా ప్రాజెక్ట్ యాజమాన్యం ఒక గోల్ తో ముందుకు సాగుతుందని, రానున్న రోజుల్లో ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా సంస్థ జాతీయ స్థాయిలో ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. తెలంగాణలోని ప్రతి మధ్య తరగతి కుటుంబాన్ని స్మార్ట్ భూ యాజమాన్యం ద్వారా తరతరాల సంపదను నిర్మించుకుని వినియోగదారులను శక్తివంతం చేయడమే ఎస్.బి.ఎం లక్ష్యమన్నారు. భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలో సమగ్రత, శ్రేష్ఠతకు స్వర్ణ ప్రమాణాలను సాధిస్తుందని చెప్పారు.

హైదరాబాద్ అభివృద్ధి కారిడార్ల వెంబడి అధిక సామర్థ్యం గల భూభాగాలను గుర్తించి, అభివృద్ధి చేయడంతో పాటు మా పెట్టుబడిదారులకు 100 శాతం చట్టపరమైన పారదర్శకత, గరిష్ట రాబడిని అందించి వారిని ఆర్థికంగా లబ్ది పొందారన్నారు.

నిపుణుల మార్గదర్శకత్వం, స్పష్టమైన టైటిళ్లు, సకాలంలో ప్రాజెక్ట్ డెలివరీని అందించడం ద్వారా మా వినియోదారుల కోసం భూమి కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసి నమ్మకం మా సంస్థ పై పూర్తి నమ్మకం కలిగిందన్నారు. కస్టమర్లకు, మార్కెటింగ్ అసోసియేట్ కు సంస్థ చెప్పింది చెప్పినట్లుగా 100 శాతం అభివృద్ధితో , వారం, పది రోజుల్లోనే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందిస్తుందని చెప్పారు. కస్టమర్ల అభిమానాన్ని ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా ప్రాజెక్ట్ గెలుచుకోవడంతోనే కేవలం 3 ఏళ్లలో 7 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేసుకుందని గర్వంగా చెప్పుకొచ్చారు. ఇటీవల ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా ప్రాజెక్ట్ వెంచర్లను డిటిసిపి అధికారులు పరిశీలన చేయగా ఇంత తొందరలో 100 శాతం అభివృద్ధి చేయడం మా జీవితంలో ఎక్కడా చూడలేదని ఎస్.బీ.ఎం సంస్థ ను మెచ్చుకోవడం జరిగిందని సూచించారు. కంపెనీ స్థాపించిన మూడేళ్లలో ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా ప్రాజెక్ట్ కు ఐ.ఎస్.ఓ సర్టిఫికెట్ సాధించిందన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ రంగంలో మెళకువలు, ప్లాట్ల వినియోగదారులకు కంపెనీ అందిస్తున్న అభివృద్ధి, మున్ముందు ఫ్యూచర్ సిటీ, హెచ్.ఎం.డీ.ఏ, పరిధిలో వచ్చే ప్రాజెక్టుల గురించి వివరించారు. మార్కెట్ లో దూసుకెళ్లిన అసోసియేట్ విజేతలకు మెమెంటో అందించి యాజమాన్యం వారిని అభినందించింది. ఈ సమావేశంలో కంపెనీ బోర్డు డైరెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లు, టీడీ లు, జీఎం లు, డీజీఎం లు, ఏజీఎం లు పాల్గొన్నారు.




హైటెక్ సిటీ గచ్చిబౌలిలో లి మెరిడియన్ 5 స్టార్ హోటల్ లో ఘనంగా జరిగిన ఎస్.బీ.ఎం 4వ ఆర్థిక సమావేశంలో అసోసియేట్ సభ్యులు, యాజమాన్యం.



ISO 9001:2015

Scan QR Code

Certificate

This is to certify that

SBM GLOBAL SERVICES

153A, RABINDRA NAGAR, BADAL BOSE SARANI, D.S LANE, HOWRAH, HOWRAH, WEST BENGAL. 711109

Has been assessed and found to be conforming the requirements of:

ISO 9001:2015

(Quality Management System)

For the Following Scope of Activities:

PROVIDE SERVICE OF IT SERVICE AND COMPUTER PROGRAMMING, CONSULTANCY ACTIVITIES

Certification No: UK-ARCT-25-14210172

| | |
|---|---|
| Date of Initial Registration: | 30/MAY/2025 |
| 1st Surveillance Audit Due: | 29/MAY/2026 |
| 2nd Surveillance Audit Due: | 29/MAY/2027 |
| Re-certification Due: | 29/MAY/2028 |

Authorized Signatory

UKAF CERT Limited

To Check this certificates status visit;- https://www.ukafcert.org.uk/

United Kingdom Accreditation Forum Cert Limited

**ఎస్.బీ.ఎం ఇన్ఫ్రా ఇండియా సంస్థ సాధించిన ఐఎస్ఓ సర్టిఫికెట్**




మార్కెటింగ్ లో విజేతల కు మెమోంటో అందజేస్తున్న యాజమాన్యం



## తెలంగాణలో ఉద్యోగుల
# బదిలీలకు గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్,ఏప్రిల్21(పద్మక్రాంతి):**

తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల పక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

# పెద్దదస్తగిరి హత్యపై
# సిబిఐతో విచారణ చేయించండి

- **ప్రస్తుత విచారణ అధికారిపై నమ్మకం లేదు**
- **మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి భార్య దీప్తి**

**కడప,ఏప్రిల్21(పద్మక్రాంతి):**



రియల్ ఎస్టేట్ వ్యాపారి, వైసిపి నేత పెద్ద దస్తగిరి హత్యలో తన భర్త మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని ఆయన సతీమణి బండి దీప్తి వెల్లడించారు. మంగళవారం అంగడి వీధిలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద దస్తగిరి హత్య కోణం, హత్య విచారణ కోణం వేరువేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. తన భర్తకు పెద్ద దస్తగిరికి స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఎటువంటి వ్యాపార లావాదేవీలు లేవని చెప్పారు. పెద్ద దస్తగిరి ఇంట్లో నూరు కోట్లు విలువ చేసే డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారని, ఇందులో ఒక లక్ష రూపాయలైనా,ఒక సైట్ అయినా దస్తగిరితో తన భర్త అగ్రిమెంట్ చేసుకోలేదని పేర్కొన్నారు. అలా లావాదేవీలు ఉన్నట్లు నిరూపించాలని తెలిపారు. పెద్ద దస్తగిరి హత్య జరిగిన వారం తర్వాత విచారణ అధికారిని మార్చివేశారని చెప్పారు. ప్రస్తుత ఉన్న అధికారిపై తనకు అనుమానం ఉందన్నారు. కేసును తప్పుదోవ పట్టిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నట్లు గత అనుభవాల దృష్ట్యా అర్థం అవుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసిపి ని, తన భర్తను టా÷-గ్గ÷ట్ చేసినట్లు భావిస్తున్నామన్నారు. విచారణ పారదర్శకంగా కొనసాగేందుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. భర్త నిత్యానందరెడ్డి తనకు అందుబాటులోకి వస్తే మీడియా సమక్షంలో లొంగిపోవాలని చెబుతానని పేర్కొన్నారు. నిజా నిజాలు నిర్ధారణ కాకుండానే తన భర్తను బలి పశువును చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిబిఐ, సిట్ తో విచారణ చేయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న విచారణ అధికారిపై తమకు నమ్మకం లేదని తెలిపారు. ఎస్పీ తమ అభ్యర్థనను ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. 16 సంవత్సరాల వైవాహిక జీవితంలో తన భర్త ఎలాంటివాడో నాకు బాగా తెలుసునని కన్నీటి పర్యంతమయ్యారు. విచారణకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు.

## పాలమూరు-రంగారెడ్డిపై
# అవాస్తవాల ప్రకటన

**95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి**

**హైదరాబాద్,ఏప్రిల్21(పద్మక్రాంతి):**



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# అబద్దాలు చెప్పడంలో కెసిఆర్ దిట్ట

- **మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపి అర్వింద్**

**హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**



వ్యవసాయ మోటర్లకు కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.

# రీల్స్ మోజులో బిల్డంగ్‌పై నుంచి పడ్డ బాలుడు

- **చికిత్స పొందుతూ మృతి**

**హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**



గంటలు తరబడి రీల్స్ స్క్రోల్ చేస్తూ టైం వేస్ట్ చేసేవారు కొందరైతే... రీల్స్ కోసం రిస్క్ చేసి ప్రాణాల మీదకు తెచుకునేవారు మరికొందరు. రీల్స్ కోసం రిస్క్ చేసి మరో బాలుడు ప్రాణాలు వదిలాడు. హైదరాబాద్ లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ బిల్డింగ్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్ లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ బస్తీకి చెందిన 14 ఏళ్ళ బాలుడు మితున్ రీల్స్ చేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మిథున్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మితున్ బిల్డింగ్ మీద నుంచి కిందపడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాలుడి మృతదేహాన్ని బీహార్ కు తరలిస్తున్నారు బంధువులు. మితున్ మృతితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలు

- **పంజాగుట్ట స్టేషన్‌లో నటి కరాటే కళ్యాణి ఫిర్యాదు**

**హైదరాబాద్,ఏప్రిల్ 21(పద్మక్రాంతి):**



నటుడు ప్రకాష్ రాజ్ పవిత్రమైన రామాయణంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని ఆరోపిస్తూ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి హైదరాబాద్ లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కోజికోడ్‌లో జరిగిన కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో ప్రకాష్ రాజ్ ప్రసంగిస్తూ.. రామాయణాన్ని వింతగా విశ్లేషించారు. ఒక చిన్నారుల నాటకాన్ని ఉటంకిస్తూ.. శ్రీరాముడు, లక్ష్మణుడు ఉత్తరాది నుండి వచ్చిన వలస కూలీలని, వారు దక్షిణాదికి వచ్చి రావణుడి తోటలో పండ్లు దొంగిలించారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, దీనికి జీఎస్టీ ని ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా అవుతున్నాయి. పవిత్ర ఇతిహాసాన్ని వక్రీకరించి, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసేలా ఆయన ప్రసంగం ఉందని కళ్యాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కరాటే కళ్యాణి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎం. రామకృష్ణను కలిసి ఫిర్యాదును అందజేశారు. ప్రకాష్ రాజ్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 196 , 299 , 353 , ఐటీ చట్టం సెక్షన్ 67 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె కోరారు. రామాయణం అనేది కోట్ల మంది భారతీయుల విశ్వాసం. దానిని వక్రీకరించి మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ, సాక్ష్యాధారాలను పోలీసులకు సమర్పించారు. మత విశ్వాసాలను అవమానించేలా, మతాల మధ్య విద్వేషాలు పెంచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణం.. ప్రభుత్వం కీలక నిర్ణయం

(హైదరాబాద్)

తెలంగాణ ప్రభుత్వం ఎంఎంటీఎస్ ప్రయాణికులకు భారీ గుడ్ న్యూస్ తెలిపింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నుంచి హైదరాబాద్ నగర వాసులకు ఎంఎంటీఎస్ సేవలు ఉచితంగా అందించేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. నగరంలో నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, పర్యావరణ కాలుష్యాన్ని అదుపు చేసే లక్ష్యంతో ఎంఎంటీఎస్ రైళ్లలో ఈ ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ పథకాన్ని ఏడాది పాటు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని, ప్రయాణికుల టికెట్ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. ఈ మేరకు జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించిన ప్రభుత్వం, అధికారికంగా దక్షిణ మధ్య రైల్వేకు ప్రతిపాదనలను పంపింది.


ఈ ప్రతిపాదనపై స్పందించిన దక్షిణ మధ్య రైల్వే, పథకం అమలుకు సంబంధించి ముసాయిదా ఎంవోయూను పంపాలని ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, పురపాలక అభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్‌రంజన్ దీనిపై ప్రత్యుత్తరం ఇస్తూ.. ప్రభుత్వం పంపే ముసాయిదాను పరిశీలించి, తుది అనుమతి కోసం రైల్వే బోర్డుకు పంపిస్తామని తెలిపారు. రైళ్ల సంఖ్య, వేళలు మరియు స్టేషన్ల నిర్వహణ వంటి అంశాలను రైల్వే బోర్డు నిబంధనల ప్రకారమే నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. అయితే, గతంలో పెండింగ్‌లో ఉన్న ఎంఎంటీఎస్-2వ దశ నిధులు రూ.




491.45 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని రైల్వే శాఖ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

ఈ ఉచిత ప్రయాణ పథకం అమలులోకి వస్తే, హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, ఇతర ప్రధాన ప్రాంతాల మధ్య ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులకు భారీ ఊరట లభించనుంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులతో పాటు ఎంఎంటీఎస్‌ను కూడా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చేయడమే ఈ పథకం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభిస్తే, జూన్ 2 నుంచి భాగ్యనగర వాసులకు లోకల్ రైలు ప్రయాణం ఉచితం కానుంది. ఇది నగర రవాణా వ్యవస్థలో ఒక చారిత్రాత్మక మార్పుగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అడగంటుతున్న భూ గర్భ జలాలు..




(కరీంనగర్)

వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతుండగా, కరీంనగర్ జిల్లాలోని నీటివనరులన్నీ నిండుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటి ఒండ్రు మట్టి తేలితున్నాయి. జిల్లా పరిధిలోని చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు అడిగంటుతున్నాయి. ఉక్కపోత, భరించలేని వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూడా నీటిని అదే స్థాయిలో వినియోగిస్తున్నారు. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతోంది. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నా రు. తమ స్థిరాస్తులు, ఆభరణాలను తనఖా పెడుతూ, అప్పులుగుకు చేసిన నీటిని పైకి తె చ్చేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిమట్టంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చిలో 8.10 మీటర్లు, ఏప్రిల్‌లో 9.02 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది.గత ఏడాది వేసవిలో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టంలో మార్పు వచ్చి, కొంతమేర ఉపశమనం కలిగింది..

అనంతరం అసలు రెయినీ సీజన్లోనే వర్షా లు ముఖం చాటేయగా, ఎప్పటికప్పుడు భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నా యి. అడపాదడపా వర్షాలు కురిసినా వాటి తో భూగర్భజలాలు పెరగలేదని భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కు సరిపడా నీరు అందకపోవడంతో పం టలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ బావుల్లో పేరుకుపోయిన మట్టిని క్రేన్ల సహాయంతో తొలగిస్తున్నారు. నీటి నిల్వలు పెరగాలని ఆశిస్తూ పెద్ద మొ త్తంలో ఖర్చు పెట్టి బావులను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా, మరింత నీరు అం దుబాటులోకి రావాలనే ఉద్దేశంతో బావుల పక్కనే సైడ్ బోర్లు కూడా వేయిస్తున్నారు.కరీంనగర్ ఎల్ఎండీ సామర్థ్యం 24.034 టీ ఎంసీ లు కాగా జలాశయంలో నీటి నిల్వలు 6.9 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజు 55 ఎంఎల్డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసేందుకు సిద్ధం అవుతుంది ఎంఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

# 22 శాతం మందికే లక్ష పైన ఆదాయం

## ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలు



(హైదరాబాద్)

తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ. లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే 3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది. అదే సమయంలో మొత్తం 242 కులాలు ఉండగా.. అందులో 135 కులాలను అత్యంత వెనుకబడినవిగా గుర్తించారు.తెలంగాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమం లోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం.. ఎస్సీల్లో 97 శాతం..బీసీల్లో 71శాతం మంది ప్రజలు..తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుక బడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది..

ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కు వగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన వారే కావడం గమనార్హం.సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య చదువుతున్న వారిలో 57 శాతంతో అగ్రవర్ణాలు ముందుండగా.. 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.

# ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో 'ఐస్‌గేట్ 2.0' సేవలు

(హైదరాబాద్)

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో ఇకపై సులభంగా కస్టమ్స్ డ్యూటీ చెల్లింపులు కోసం ఐస్‌గేట్ 2.0 పోర్టల్‌తో అనుసంధానమైనట్లు ఆ బ్యాంక్ తెలిపింది. తన ఖాతాదారుల కోసం కస్టమ్స్ డ్యూటీ, సెంట్రల్ ఎక్సైజ్ పన్నుల డిజిటల్ చెల్లింపు సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ సౌకర్యం ద్వారా వ్యాపారస్తులు, వ్యక్తులు సురక్షితంగా పన్నులు చెల్లించి తక్షణమే చలానాలను పొందవచ్చని బ్యాంక్ రిటైల్ లయబిలిటీస్ హెడ్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఇది భారతదేశ డిజిటల్ పన్ను వ్యవస్థలో తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రంలో రోజువారీ కూలీల్లో ఎస్సీలే అధికం..

## 13 శాతం మందికి నో టాయిలెట్స్

(హైదరాబాద్)

రాష్ట్రంలోని ఎస్సీల్లో రోజువారీ కూలీలే అత్యధిక సంఖ్యలో ఉన్నారని సమగ్ర కుటుంబ సర్వే నివేదిక వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాల వారిలో 25 శాతం మంది దినసరి కూలీలుగా, 29 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 27 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. కేవలం 11 శాతం మంది మాత్రమే స్వయంగా సాగు చేసుకునే రైతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 17.4 శాతంగా ఉన్నప్పటికీ వివిధ రంగాల్లో దీనికి తగినంత ప్రాతినిధ్యం లేదు. 7 శాతం మంది మాత్రమే వ్యాపారాలు లేదా అనుబంధ రంగాల్లో వారి పని వారు చేసుకుంటున్నారు.

తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే జీవనం : ఇక షెడ్యూల్డ్ తెగల విషయానికి వస్తే 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. 23 శాతం మంది స్వయంగా సాగు చేసుకునే రైతులుగా ఉన్నారు. ఇక మొత్తం జనాభాలో 10.3 శాతంగా ఉన్న ఎస్టీ విభాగంలో 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా, 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా పని చేస్తున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే అత్యధిక శాతం మంది తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని స్పష్టమవుతోంది. వీరిలో 3 శాతం మందికి మాత్రమే మధ్యతరహా లేదా భారీ స్థాయి వ్యాపారాలు సొంతంగా ఉన్నాయి.

బీసీల్లో జనాభాకు తగ్గట్టుగా : ఇక బీసీల విషయానికొస్తే వీరు మొత్తం జనాభాలో 52.6 శాతంగా ఉన్నారు. ఇందులో రోజువారీ కూలీలుగా పని చేసేవారిలో వీరి వాటా 58 శాతంగా ఉంది. అదేవిధంగా ఉపాధి హామీ పనుల్లో 58 శాతం కాగా, వ్యవసాయ కూలీల్లో 52 శాతంగా ఉంది. సాగుదారులుగా ఉన్న వారిలో బీసీలు 54 శాతం ఉన్నారు. వ్యాపార రంగంలో కూడా వీరి ప్రాతినిధ్యం గణనీయంగా ఉండటంతో 53 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరి వాటా 54 శాతం కాగా, ప్రైవేటు రంగ ఉద్యోగాల్లో




53 శాతంగా ఉంది. భారీ పరిశ్రమలు, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లోని మొత్తం వీరు 53 శాతం ఉన్నారని నివేదికలో పేర్కొంది.

ఓసీల్లో 4 శాతం మాత్రమే : ఓపెన్ కేటగిరీల విషయానికి వస్తే రోజువారీ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీల్లో వీరి వాటా కేవలం 4 శాతం మాత్రమే. సాగుదారులతో అయితే 12 శాతం, వ్యాపారాల్లో 39 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 19 శాతం, ప్రైవేటు రంగంలో 29 శాతంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే మొత్తం జనాభాలో కేవలం 56.4 శాతం మంది మాత్రమే 12వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో షెడ్యూల్డ్ కులాల శాతం 57 శాతంతో సగటు కంటే కొంచెం ఎక్కువగా ఉంది. ఇక బీసీలు, షెడ్యూల్డ్ తెగల విషయానికి వస్తే నమోదైన గణాంకాలు వరుసగా 54, 53 శాతంగా ఉన్నాయి.

మరుగుదొడ్ల సౌకర్యం లేదు : తెలంగాణలో మొత్తం జనాభాలో 13.5 శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేదు. ఈ టాయిలెట్? సౌకర్యాల లేమి ఎస్టీ జనాభాలో 32.5 శాతం మంది, ఎస్సీలో 18.8 శాతం, బీసీల్లో 10.8 శాతం, ఓసీల్లో 4.5 శాతంగా ఉంది. వివిధ సామాజిక వర్గాల మధ్య పారిశుద్ధ్యం, ఆరోగ్యం అసమానతలకు ఈ విషయం ఒక సూచికగా గుర్తుంటుందని నివేదికలో పేర్కొంది. ప్రత్యేకించి ఈ సమస్య మహిళ భద్రత, గౌరవానికి సంబంధించిన విషమని తెలిపింది.


# గోదావరి ప్రాజెక్టుకు రూ.7,360 కోట్లు సాంక్షన్



(హైదరాబాద్)

హైదరాబాద్ సిటీ తాగునీటి అవసరాల కోసం చేపట్టిన గోదావరి ఫేజ్-2, 3 ప్రాజెక్టు ప్యాకేజీ--1కు రూ.7,360 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 447 జారీ చేసింది. ఈ మేరకు ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. మూసీ సుందరీకరణ కోసం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను గోదావరి నీటితో నింపే పథకానికి కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హ్యామ్ మోడ్‌లో ఈ ప్రాజెక్టును అమలు చేయనుండగా, ఇందులో నిర్మాణ సంస్థ 60 శాతం, ప్రభుత్వం 40 శాతం వ్యయాన్ని భరిస్తుంది. గోదావరి రెండో, మూడో దశల ద్వారా నగరానికి రోజుకు 320 ఎంజీడీల నీటిని తరలించనున్నారు. ఎల్లంపల్లి నుంచి శామీర్‌పేట వరకు ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ఆరు నెలల క్రితమే ప్రారంభమయ్యాయి. సుమారు 4 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఫ్లై యాష్ వినియోగంలో తెలంగాణ వెనుకంజ..



(హైదరాబాద్)

థర్మల్ పవర్ ప్లాంట్లలో బొగ్గును మండించడం ద్వారా ఉత్పత్తి అయ్యే ఫ్లై యాష్(బూడిద)ను ఒకప్పుడు వ్యర్థంగా పరిగణించేవారు. కాలక్రమేణా ఇది నిర్మాణ రంగానికి కీలక ముడి సరుకుగా, పర్యావరణ పరిరక్షణకు సహాయపడే వనరుగా, ప్రభుత్వాలకు ఆదాయాన్ని అందించే ఆర్థిక సంపదగా మారింది. దేశవ్యాప్తంగా బూడిదను సమర్థంగా వినియోగిస్తూ మౌలిక వసతుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుండగా, తెలంగాణ మాత్రం ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోలేకపోతోంది. కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం దేశం దాదాపు 96 శాతం బూడిదను వినియోగిస్తున్నప్పటికీ, తెలంగాణలో ఈ శాతం 76.57కే పరిమితమవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని థర్మల్ ప్లాంట్ల పనితీరు తక్కువగా ఉండటం, పరిశ్రమలతో సమన్వయం లోపించడం, రవాణా సమస్యలు వంటి కారణాలతో రాష్ట్రం జాతీయ సగటుతో పోలిస్తే గణనీయంగా వెనుకబడినట్టు నివేదిక స్పష్టం చేస్తోంది.

రాష్ట్రంలో 10 థర్మల్ పవర్ ప్లాంట్లు ఉండగా, మొత్తం స్థాపిత సామర్థ్యం 9442.5 మెగావాట్లు. 2024-25లో 155.10 లక్షల మెట్రిక్ టన్నుల(ఎల్ఎంటీ) బూడిద ఉత్పత్తి కాగా.. అందులో కేవలం 118.77 ఎల్ఎంటీ మాత్రమే వినియోగించారు. రాష్ట్రంలో బూడిద మొత్తం వినియోగం 76.57 శాతం మాత్రమే. ఇది జాతీయ సగటుతో పోలిస్తే చాలా తక్కువ. దేశవ్యాప్తంగా 214 గిగావాట్ల సామర్థ్యం గల 189 థర్మల్ ప్లాంట్లలో మొత్తం బూడిద ఉత్పత్తి 3187.98 ఎల్ఎంటీ కాగా.. వినియోగం 3071.38 ఎల్ఎంటీగా ఉంది. వినియోగ శాతం 96.34 అంటే దేశం దాదాపు పూర్తి స్థాయిలో బూడిదను ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మాత్రం జాతీయ సగటుతో పోలిస్తే ఎంతో వెనకబడిపోయి ఆర్థిక వనరును సద్వినియోగం చేసుకోలేకపోతోందని సీఈఏ నివేదిక వెల్లడించింది. జాతీయ సగటు కంటే తెలంగాణ 20 శాతం తక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ప్లాంట్లలో వినియోగం కేవలం 68.87శాతమే ఉంటే.. రాష్ట్రంలోనే ఉన్న కేంద్ర ప్లాంట్లు(ఎన్టీపీసీ) మాత్రం 86.08 శాతంతో మెరుగ్గా ఉన్నాయి. రాష్ట్ర రంగంలోనే ప్రధాన లోపం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, బిహార్, హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాలు 100 శాతం బూడిద వినియోగంతో దూసుకుపోతున్నాయి. ఇవి పాత బూడిద(లెగసీ యాష్)నూ ఉపయోగించి ఆదర్శంగా నిలిచాయి. మొత్తం 13 రాష్ట్రాలు ఏటా 10 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ బూడిదను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇందులో ఛత్తీస్‌గఢ్ అత్యధికంగా 49.79 మిలియన్ టన్నుల బూడిదను ఉత్పత్తి చేస్తోంది.

బొగ్గు గనుల సమీపంలో ఉండే ప్లాంట్లను పిట్ హెడ్ ప్లాంట్లు అని, దూరంగా ఉండే వాటిని నాన్-పిట్ హెడ్ అని అంటారు. పిట్ హెడ్ ప్లాంట్లలో వినియోగం 89.36 శాతంగా ఉంది. ఇక్కడ రోడ్ల నిర్మాణం(66శాతం) ప్రధాన వినియోగ మార్గంగా ఉంది. నాన్-పిట్ హెడ్ ప్లాంట్లలో 98.55 శాతంతో అత్యధిక వినియోగం కనిపిస్తోంది. ఇక్కడ సిమెంట్ తయారీ(35శాతం) ద్వారా బూడిద ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఫ్లై యాష్ వినియోగం అనేక రంగాలకు కీలకంగా ఉంది. రోడ్ల నిర్మాణంలో బలమైన బేస్ మెటీరియల్‌గా బూడిద పనిచేస్తోంది. ఇటుకల తయారీలో మట్టి వినియోగం తగ్గించేందుకు, సిమెంట్ పరిశ్రమలో ఖర్చు తగ్గింపునకూ ఫ్లై యాష్ కీలకం. ఫలితంగా పర్యావరణ కాలుష్యం తగ్గింపునకు అవకాశం ఏర్పడుతుంది. అంటే ఇది వ్యర్థం కాదు విలువైన నిర్మాణ వనరు అని చెప్పవచ్చు.

బూడిదను ప్లాంట్ల నుంచి పరిశ్రమలకు తరలించేందుకు సరైన లాజిస్టిక్స్ లేకపోవడం రాష్ట్రంలో ప్రధాన సమస్యగా ఉంది. సిమెంట్, ఇటుక పరిశ్రమలతో సమన్వయం తక్కువగా ఉండటం కనిపిస్తోంది. కేంద్ర మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర స్థాయిలో కఠినంగా అమలు కాకపోవడం సమస్యగా మారింది. పాత బూడిద నిల్వలు ఎక్కువగా ఉండటం వల్ల వినియోగం మందగించింది. ఫ్లై యాష్ ప్రయోజనాలపై చిన్న పరిశ్రమలకు సరైన అవగాహన లేకపోవడం బూడిద వినియోగం తగ్గడానికి కారణాలు.

సిమెంట్, రోడ్ల నిర్మాణ రంగాలతో ఒప్పందాలు పెంచాలి. బూడిద రవాణాకు సబ్సిడీలు ఇవ్వాలని కన్‌స్ట్రక్షన్ కంపెనీలు కోరుతున్నాయి. పాత బూడిద వినియోగంపై ప్రత్యేక ప్రణాళికలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ ప్లాంట్ల పనితీరును మెరుగుపరచాలి. సరైన విధానాలు, సమన్వయం ఉంటే బూడిద రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక




# జూన్ 11న డ్రాగన్ మూవీ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.





# 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల

కాళీ క్రాఫ్ట్స్ మరియు నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ డయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉందని, ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా అవి విడుదల కాలేదని, ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు. నటి సుజాత దీక్షిత్ మాట్లాడుతూ, తన నిజస్వరూపానికి భిన్నంగా ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఉంటూ కళ్ళతో పలికించే పాత్రను దర్శకుడు తనతో చేయించారని తెలిపారు. హీరోయిన్లు యానీ డయానా, దివ్య విశ్వకర్మ తమకు తెలుగు రాకపోయినా చిత్ర బృందం ఎంతో సహకరించిందని, ఇదొక మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు. బలగం సత్య, లిరిసిస్ట్ రాంబాబు గోసాల కూడా చిత్ర విజయానికి తమ ఆకాంక్షలను తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను పలకరించనుంది.



# జైలర్-2 షూటింగ్ పూర్తి

## ▪ కేక్ కట్‌చేసి సెటబ్రేషన్ చేసుకున్న యూనిట్

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు. దీంతో అభిమానులు రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, రమ్య కృష్ణన్, మిర్నా మీనన్, యోగి బాబు వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే 'జైలర్ 2' షూటింగ్ పూర్తవడంతో, ఇప్పుడు అందరి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు రిలీజ్ డేట్‌పై ఉంది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో 'వేద్' వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు




# ట్రంప్‌కు ఇరానీ టీ ఆఫర్ చేసిన తరుణ్ భాస్కర్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న ఓ నిర్ణయంతో యువకుడి జీవితం ఎన్ని మలుపులు తిరిగింది.. అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'గాయపడిన సింహం'. మే 1న థియేటర్‌లలో సందడి చేయనుంది. ఏప్రిల్ 30నే విదేశాల్లో రిలీజ్ కానుంది. ఇరాన్‌లో మాత్రం ఇది విడుదల కావడం లేదని తెలుపుతూ తాజాగా ఫన్నీ ఏఐ వీడియోను టీమ్ పంచుకుంది. ట్రంప్‌నకు టీ ఇచ్చిన తరుణ్ భాస్కర్ ఇది ఇండియన్ టీ కాదు, ఇరాన్ టీ అని చెప్పడం.. అక్కడ ఈ సినిమా విడుదల చేయొద్దని ట్రంప్ ఆదేశించారంటూ సరదాగా ఉందీ వీడియో. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తరుణ్ భాస్కర్‌కు జోడీగా ఫరియా అబ్దుల్లా నటించారు.




# ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు

తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరఎతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

నటి కాయదు లోహర్ సంచలన నిర్ణయం







Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh